వివేక దీప్తి



నిర్భయానంద శ్రీ మేకా నరసింహ్వారావార్యులు

చలాచలబోధ గురుస్థానము

అనరాదా గురుదైవమనీ పరబ్రహ్మమనీ
అనరాదా గురు దైవమనీ

1) గురుడే హరుడని నరుడు కాడని
నిరతము మదిలో అరమరలేక
గురుపద యుగళము కొలచిన వారికి
మరణము జననము రహితము కాదు ॥అనరాదా॥

2) మానవ జన్మకు సార్ధకమిదియని
తనువు మనసు ధనము ఒసగి
కనవలెరా ఇది సాధన రహితము
పూర్వజన్మ సుకృతము వలనను దొరికెను గురుడు ॥అనరాదా॥

3) ద్వాదశి ధర్మము తెలిపె నిజమని
షోడశి మర్మము ఏమీలేదని
పంచదశిని గని ఎరుకను విడుమనే
సద్గురు దేవులు నిత్య నిర్భయానందులు ॥అనరాదా॥

శ్రీ గురుభ్యోనమః

- మున్నుడి -

" గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః
గురుసాక్షాత్ పరబ్రహ్మా తస్మైశ్రీ గురవేనమః "

జీవుడు చావుపుట్టుకలనే సంసారచక్రములో తగుల్కొని దానినుండి బయటపడే మార్గాన్వేషణా క్రమములో గురువు తోడ్పాటు అత్యంతావశ్యకము. కావున సద్గురువు లభించుట పురాకృత పుణ్యమే.

లోకములో ప్రతిపనికి కార్యకారణ సంబంధముంటుంది. దాని మూలాలు అగమ్యగోచరాలు. గురుకృప కలిగితేనే గురువు లభించుతాడు. అసలు గురువే శిష్యుని వెదుకుకొనుచూవస్తాడు.

సద్గురువు లభించినంత మాత్రాన సాధకునకు సమస్తము లభించినట్లే. అయినప్పటికి గురూపదేశము ననుసరించి దాసభావనతో శుశ్రూషచేయుచూ, గురు నిర్దేశ మార్గములో ముముక్షువై నడుచుకోవాలి.

గురువులేని సాధన చుక్కాని లేని నౌకాయానము వంటిది. కావున ఆధ్యాత్మిక మార్గ ప్రయాణములో గురువుకు ఉన్నత స్థానమున్నది.

అట్టి గురుస్థానములో నున్న గురువుల ప్రేరణతో ఈ సంకలన కర్తలు విశేష కృషి చేయుచున్నారు. ముదావహము. తాము తరించుట ఉత్తమము. తాము తరిస్తూ తమతో నున్న వారిని కూడ తరింపజేయుటకు చేయు కృషి ఉత్తమోత్తమము. విమలాంబ శ్రీమాతా అరుణ గారి ప్రేరణ, ప్రోత్సాహాలతో శ్రీమతి సంపూర్ణమ్మగారు ఈసంకలనముకూర్చిరి. వీరికృషి అభినందనీయము.

ప్రారంభదశలో నున్న ముముక్షువులు వేదాంత గ్రంథాలనన్నిటిని ఔపోశన పట్టలేరు. అంతియేగాక గహనమైన విషయము నుండి పిండితార్థ మును గ్రహింపగల్గుట కష్టసాధ్యము. సంకలన కర్తలు ఎంతో శ్రమకోర్చి

మరెంతో కృషితో శ్రద్ధాసక్తులతో విషయ సేకరణ జేసి ప్రాధాన్యతా క్రమములో ఏర్చి కూర్చి ముముక్షువులకు అమూల్యమైన సహాయము చేసిరి.

ఈ వ్యాసాల సంకలనము వేదాంత విషయాలను అత్యంత సులభ మొనర్చినది. అరటిపండు తోలు వొలిచి పండు పెట్టిన చందాన తేలికగా తెలిసే విధముగా చెప్పిరి. ఈ ప్రయత్నములో వారు సఫలీకృతులైరి.

ప్రారబ్ధ, ఆగమి, సంచితకర్మలను గూర్చి చక్కగ వర్ణించిరి. వాసనలు - వాటిని వదల్చుకొనుటకు గూర్చిన వైనము 'వాసనలు' అనే వ్యాసములో ఎంతో సులభముగ తెలియపర్చిరి. 'గుణత్రయ' మనెడి వ్యాసములో వానిఉనికి, వాని నుండి బయట పడే మార్గమును తెల్పిరి. 'ఆత్మ స్వరూప నిరూపణ'లో ఆత్మ అంటే ఏమిటో తెల్పుచూ దాని స్వరూప స్వభావాల నేకరువపెట్టిరి. 'పరోక్ష - అపరోక్ష జ్ఞానమ' నెడి వ్యాసములో ఎంతో చక్కగా నిర్వచించి క్లిష్టతను తొలగించి సులువుగా బోధపడునట్లు నుడివిరి. 'వైరాగ్యము' - జీవ వ్యాసాలు కూడ చక్కగ చెప్పుట జరిగినది.

'వివేకచూడామణి', 'గీత' మున్నగు వేదాంత శాస్త్ర గ్రంథజాలములోని విషయాలను క్రోడీకరించి ఒకచోట చేర్చి ప్రాథమిక దశలోనున్న సాధకులకు ఎంతో మేలొనర్చిరి.

ఈ రెండు మాటలు వ్రాయుటకు నాకీ అవకాశము కల్పించిన మాతృ స్వరూపులైన డా॥ అరుణ గార్కి సంపూర్ణమ్మ గార్కి హృదయ పూర్వక నమస్సుమాంజులు సమర్పించుకొనుచున్నాను.

వీరి నుండి మరిన్ని తత్త్వబోధక రచనలు వెలువడాలని ఆకాంక్షించుచూ గురుపాదాంఘ్రిరేణువు.

విజయవాడ

9-6-2012

పుట్టగుంట హేమ కోటేశ్వరరావు

M.A., M.Phil, B.Ed.

శ్రీ గురుభ్యోనమః

ప్రారబ్ధకర్మ

ప్రారబ్ధకర్మయనగా ప్రయోగింపబడిన బాణము. బాణమును వదలిన తరువాత దానినుపసంహరింప తనచేతనే సాధ్యముకాదు. ప్రయోగింపబడిన శరము లక్ష్యమయిన ప్రాణిని భేదించియే తీరును. వేయబడిన బాణము ఫలమును కలుగజేయు విధమున తాజేసిన పూర్వకర్మయనబడు ప్రారబ్ధము సుఖదుఃఖాది ఫలమును కలుగజేయును. ఆగామియనగా తన చేతిలోని శరము ఇష్టముండిన దానిని ఆపవచ్చును. ఇది జ్ఞానముచే నాశమగును. సంచితమనగా అనేక జన్మల నుండి జగత్తున ఎన్ని రూపములున్నవో వానినన్నింటిని ధరించి శతకోటి ముఖములుగా ఆర్జింపబడిన మలిన ధన సమూహము. మహావిశాలమైన అరణ్యమును గొడ్డళ్ళచే, కత్తులచే ఛేదింప సాధ్యముకాదు. బాంబు ప్రయోగించి దహించి వేయవలెను. ఇది శ్రవణమనన నిధి ధ్యానములచే నశించునది కాదు. చిలుముపట్టిన బంగారమును అగ్నిలో కాల్చిన సకల మాలిన్యము నశించి శుద్ధమగునట్లు, జీవుడు మలినాత్ముడ యినను అహం బ్రహ్మోస్మి అను విజ్ఞానముచే శుద్ధతను పొందుచున్నాడు.

ఈ విధముగా కర్మలు సంచితము, ప్రారబ్ధము, ఆగామి అని మూడు రకములు. జ్ఞానము కలుగక ముందుగానే ఆరంభింపబడిన కర్మ ప్రారబ్ధ కర్మ. ఇది జ్ఞానోదయమైనను నాశమొందదు. ప్రారబ్ధమని మహాత్ములు ఊరకే యుండలేదు. ప్రయత్నముతో మార్గమును సాధించిరి. విశ్వామిత్రాదులు దీనికి తార్కాణము. స్వప్రయత్న బలిమి దైవానుగ్రహమున్ను ప్రారబ్ధ కర్మను నెట్టి వేయును. అభ్యాసమునందిట్టి బలము కలదు.

యోగులకు ప్రయత్నము లేకనే వచ్చిపడు సుఖదుఃఖములు ప్రారబ్ధ కర్మయని తెలియవలయును. తత్త్వజ్ఞానము వలన సంచితము క్షయమగు చున్నది. కాని ప్రారబ్ధ కర్మము జ్ఞానోదయమయిన వెంటనే నాశనము కాదు.

ఒకనొక ధర్మిష్ఠుడు క్రూరమృగములు సంచరించు అరణ్య ప్రదేశమున గోవుని జూచి పులియని భ్రమచెంది, శరమును ప్రయోగించెను. శరము గోవుని హింసించినది. మొదట అతనికి వ్యాఘ్రబుద్ధియు తరువాత గోబుద్ధియు కలిగినది. గోజ్ఞానము ఆసమయమున ఉపయోగపడకపోయిన ఆ జ్ఞానము ముందు చేయు కార్యములకు ఉపయోగపడినది. అలాగున తాను అవివేకముచే దేహాభిమానమును సత్యమని భావించి నానావిధ కర్మ శరములను ప్రయోగించుచున్నాడు. శరము లక్ష్యమును భేదించునటులకర్మ స్వస్వరూప లక్ష్యమును నాశము చేయుచున్నది. వెంటనే ఈశ్వరానుగ్రహముచే తన నిజ స్వరూపము కర్మరహితమని గోచరమాయెను. అయినను కర్మలు అనివార్యమగుటచే ఫలవంతములగుచున్నవి. అగ్ని తెలియక తాకినను కాల్చుచున్నది. చేదు ఫలము తెలియక తినినను చేదును అందించును. మధురఫలము తీపిని కలుగజేయును. సర్వేశ్వరుడు ఫలదాత గనుక జీవుల కర్మానుసారము ఫలము నొసగుచున్నాడు.

ఒక చోరుడు ఇతరుల వస్తువుల నపహరించుచున్నాడు. అతడు తన తప్పు తెలిసికొని న్యాయాధికారిని శరణు జొచ్చుచున్నాడు. న్యాయాధిపతి ధర్మాత్ముడగుటచే శిక్షను విధించుచున్నాడు. అతను ఆ శిక్ష సంతోషముగా అనుభవించుచున్నాడు.తెలిసి దొంగలించు వానిని కఠినముగా శిక్షించు చున్నాడు. సర్వేశ్వరుడు పక్షపాత రహితుడగుటచే సులభముగా ఫలితము ననుభవించునటుల చేయుచున్నాడు. ప్రారబ్ధ కర్మ వివేకముగా చేయబడిన అవివేకముచే చేయబడినను అవశ్యము ఫలము నొసగుచున్నది.

శ్రీరాముడు, నలమహారాజు, ధర్మరాజు అనేక దుఃఖముల ననుభ వించారు. నలుడు, ధర్మరాజు జూదరులయినందున రాజ్యములను పొగొట్టు కొనిరి. దశరథ మహారాజు ఏనుగు వచ్చినదని నీటి శబ్దము విని ఋషి కుమారునిపై శరమును ప్రయోగించెను. శ్రీరాముడు వాలిని చాటుగా

సంహరించినందున కృష్ణావతారమున వ్యాధునిచే కొట్టబడి దేహము చాలించెను. పాండురాజు మృగరూపములో నున్న ముని దంపతులను బాణ ప్రయోగము చేసి సంహరించెను. అందుకు శాపగ్రస్తుడాయెను. కావున పుణ్య, పాప కర్మల వలన సుఖదుఃఖములు కలుగుచున్నవి. వానిని విడనాడి శుకునివలె నుండువారు కర్మరహితులై యుందురని తెలియవలెను.

ప్రారబ్ధకర్మ మహాబలిష్ఠమైనది. అదియే మలిన జన్మకు కారణము. సంసార చక్ర భ్రమణ హేతువు. చేయబడిన కర్మ కోటి కల్పముల కయినను నాశములేదు. కనుక ప్రారబ్ధకర్మ అనుభవించియే తీరవలెను. అగ్నిదేవుడు సమస్తమును దగ్ధము చేయునటుల స్వానుభవ ప్రజ్ఞావంతులు సమస్త కర్మలను దహింపజేయుచున్నారు. జ్ఞాని యొక్క పాపరూప సమస్త కర్మలు నాశము నొందుచున్నవి. వారికి ప్రారబ్ధ కర్మ మిగిలి యుండదని భావము. ఎవని అంతఃకరణమునందు బాగుగా జ్ఞానాగ్ని ప్రజ్వరిల్లుచున్నదో ఆ మహానుభావుని అంతఃకరణము నందు సమస్త కర్మకాష్ఠములు దహింపబడుచున్నవి. ఒక భవనము దహింపబడు చుండగా అందులోని కొత్త పాత సామానులు కాలిపోవునట్లు సంసారమనెడి అంతఃకరణమును జ్ఞానాగ్నికి ఆహుతి చేయుచుండగా సంచిత ఆగామి కర్మలు మిగలవు. ప్రారబ్ధము కూడా దహించుకొనియే పోవును. బ్రహ్మజ్ఞానులకు మూడు కర్మలు కూడా లేవనియే తెలుపుచున్నారు. స్వాత్మ జ్ఞానులు సర్వదా పరబ్రహ్మమందు విహరించుచు పరబ్రహ్మములైయున్నారు. పరిపూర్ణ జ్ఞానికి ప్రారబ్ధమున్నదని తోచిన అతడింకను పరిపూర్ణావస్థను పొందలేదని నిశ్చయించవలెను. ఈ దేహము నాది, ఈ పరికరములు నావి, అను భేదబుద్ధిని విడనాడి తానాబ్రహ్మమేయని స్వరూప నిష్ఠతో నున్న మహానుభావునికి ప్రారబ్ధకర్మలేదు. కేవల బ్రహ్మస్థితిలో నున్నవానికి పరబ్రహ్మము తప్ప మఱియొకటియుండదు. అట్టి పరతత్త్వ జ్ఞానవీధి విహారులకు ప్రారబ్ధ కర్మలుండవు.

దేహము కర్మచే నిర్మితమగుచున్నది. అంతఃకరణ పుణ్య పాపములచే సూక్ష్మదేహము కలుగుచున్నది. కర్మ ఫలితానుభవమునకై స్థూల దేహము వచ్చుచున్నది. స్థూల దేహమునందు సూక్ష్మదేహము నందు అజ్ఞాన కారణముండుటచే కారణ శరీర మేర్పడుచున్నది. కావున దేహము కర్మత్రయ నిర్మితము. ప్రారబ్ధ కర్మ స్థూల దేహము నాశ్రయించియు, సంచిత ఆగాములు అంతఃకరణము నాశ్రయించి యున్నవి. జ్ఞానులకు అంతఃకరణ పారిశుద్ధ్య ముచే సంచిత ఆగాములు నశించుచున్నవి. శరీరముతో పాటు ప్రారబ్ధము నాశనమగుచున్నది. అనిత్యమగు ప్రారబ్ధ కర్మ నిత్యాత్మకు లేదు. ఆత్మకర్మ నిర్మితము గాదు. దేహము కర్మ నిర్మితము గనుక కర్మదేహగత ధర్మమగు చున్నది. ఆత్మకర్మ రహితమని నిరూపించి నందుచే జ్ఞానులు ప్రారబ్ధాదికర్మ రహితులు.

వేదవాణి ఆత్మవస్తువు. జనన మరణ రహితము శాశ్వతము అని ఘోషించుచున్నది. ఇట్టి పరమ సత్యమును గ్రహించనివారు నిరంతరము సంసారగర్తమున పడియుందురు. పరిపూర్ణ చంద్రునియందు కళంకమున్నట్లు గగనమందు నీలరూపత్వమున్నట్లు విశుద్ధ జ్ఞానులయందు ప్రారబ్ధము కల్పించి చెప్పుదురు. పరిపూర్ణ చంద్రుని యందు కళంకములేదు. భూఛాయ క్రిందనున్న వారికి ఆలాగున భాసించు చున్నదని తత్త్వజ్ఞులు చెప్పుదురు. ఆకాశమందు నీలత్వము అసిద్ధమగునట్లు జ్ఞానులకు ప్రారబ్ధము అసిద్ధమయ్యేయున్నది. ఈ ప్రారబ్ధము కొందరిని ఉన్నత దశనుండి త్రోయు చున్నది. పరమాత్మ యందున్న వారికి అసిద్ధమయిన ప్రారబ్ధకర్మ సిద్ధముగాకనే పోవుచున్నది.

అనాత్మ దేహమునే నేనని తలంచి తాదాత్మ్యము నొందుటయే ప్రధాన భూత ప్రారబ్ధ కర్మ మూలకారణము. అనాత్మభావనయే దేహము నుత్పత్తి చేయుచున్నది. దేహాత్మ బుద్ధి చేతనే ప్రారబ్ధ కర్మ సిద్ధమగు చున్నది. దేహము

నిత్యమయినచో ప్రారబ్ధ కర్మయు సత్యమేయగును. శరీరమనిత్యము తదాశ్రిత ప్రారబ్ధము కలవంటిదేయగును. కావున ప్రారబ్ధ కర్మను పరమాత్మ భావనచే స్వస్వరూప విజ్ఞానముచే ధ్వంస మొనరించవలయును. సిద్ధులకు దేహాత్మ భావన శూన్యమయినందున ప్రారబ్ధ కర్మయేలేదు.

దేహాత్మ భావనయే నిజముగానందున దేహమే అస్థిరమగుట చేత దేహమునకు ప్రారబ్ధ కర్మను కల్పించుటయు భ్రాంతియే. అజ్ఞానముచే దేహము వచ్చినది. అజ్ఞానమే లేనప్పుడు దేహము లేదు. శరీరమే లేనప్పుడు తదాశ్రిత ప్రారబ్ధ కర్మయు సత్యము కాదు. ప్రారబ్ధ వ్యవహార మంతయు భ్రాంతియే. త్రాటియందు పాము కల్పింబడెను పైగా ఆ పాము కరచెను. ఇది సత్యమా ? కుందేటి కొమ్ము నిజముగాకపోగా దాని గంధము వ్రణములను మాన్పెనను విషయము సత్యమగునా? లోకమున వస్తువు లన్నియు కల్పితములే. మిథ్యా భూత శరీరమందు ప్రారబ్ధ కర్మ కల్పితమాయెను. ఆకల్పిత ప్రారబ్ధ కర్మకు స్థితిగాని పుట్టుక గాని సంభవించవు. ప్రారబ్ధ కర్మయనునది త్రికాలముల యందునులేదు. పరబ్రహ్మ వస్తువు ఒకటియేయున్నది. తదితర దృశ్యమం తయులేదు. ఒకప్పుడుండి ఒకప్పుడు లేనిదానికి ఉత్పత్తి వినాశములు లేవు.

జ్ఞానమనునది సత్తా వస్తువు. జననమరణ రహితమైనది. తాను నిత్యమగు పరమాత్మయని తెలిసి తద్రూపుడగుటయే విజ్ఞానము. అట్టి విజ్ఞానముచే అనాత్మ దేహాది భావనలు నాశనమగుచున్నవి. అజ్ఞానముతో పాటు సంసార దుఃఖము నశించుచున్నది. తానా పరబ్రహ్మకాగా దేహమే లేదు. లేనట్టి దేహమునకు ప్రారబ్ధ కర్మ ఎట్లు సంభవించును. కాన శరీరము ప్రారబ్ధ కర్మ సత్యములు కావని సిద్ధాంతము.

శ్రీ గురుభ్యోనమః

వాసనలు

వాసనలనగా అనేక జన్మపరంపరలనుండి వచ్చెడి సంస్కార వాసనా వాసితములయిన హృదయ గ్రంథులు. ఈ వాసనలు మిగుల ప్రబలమైనవి. కర్మలచేతనే అనేక శరీర పరంపరలు వచ్చుచున్నవి. ఇట్టి కర్మబీజములు అంతఃకరణమున హత్తుకొని యున్నవి. అందుచే అంతఃకరణమున నానావిధ వాసనలున్నవి. ఆ వాసనలు నశించిన కర్మాంకురములు దహించినవి యగుచున్నవి. చిత్తమనగా తిరుగా జన్మమును కలుగజేయు ఘన సంకల్ప వాసనలే. వాసనలు పోయిన చిత్తమనునది లేకపోవుచున్నది. వాసనలే మనస్సు గనుక వాసనలు నశించిన మనస్సు సంకల్పించజాలదు.

వాసనలను నశింపజేయుటకై యోగీశ్వరులు యోగాభ్యాసమును జేయుదురు. యోగశక్తిచే నవి యణగిపోవచ్చును. నేను కర్తను, నేను భోక్తను అను అనాది దృఢతర వాసనయో, నేను కర్తనుగాను, భోక్తనుగాను కర్తృత్వ భోక్తృత్వ రహిత పరబ్రహ్మమే నేను అనుదృఢతర స్వరూప జ్ఞానము చేతనే పూర్తిగా నశించుచున్నవి. పరవస్తువు జ్ఞానము కలిగినను వాసనాంకుర మున్నందున దృఢతర జ్ఞానము కలుగనందున కర్తృత్వ భోక్తృత్వ వాసన జన్మపరంపర జీవునకు కలుగజేయును. అంతరాత్మ ధ్యానములో నున్న మహనీయుడు వాసనను ప్రయత్నముతో అభ్యాసముతో పోగొట్టగలడు. కావుననే "మోక్షమనగా సకల వాసనా క్షయము" అని మునీశ్వరులు చెప్పుచున్నారు.

బంధమనునది వాసనాబంధమె. మోక్షమనునది వాసనాక్షయమె. వాసనలు వృత్తులు నశించిన బుద్ధిచేత ఏకర్మ చేయబడుచున్నదో ఆకర్మ కాల్చబడిన విత్తనమువలె అంకురము నీయజాలదు. కర్మలచేతనే జన్మ పరంపరలు కలుగుచున్నవి. అంతఃకరణమున నానావిధ వాసనలున్నవి. ఆవాసనలు నశించిన కర్మాంకురములు దహించినవి యగుచున్నవి. ఇదియే

జ్ఞానదశ. జ్ఞానాగ్ని సర్వకర్మలను భస్మము చేయును. వాసనలు నశించిన బుద్ధియే జ్ఞానము. ఇట్టి జ్ఞానిని కర్మలు బంధించజాలవు. జ్ఞానికి చిత్తమనునది లేదు. చిత్తేయున్నది. వాసనారాహిత్యమే అమనస్కస్థితి.

వాసన త్రయము అనగా 1. లోకవాసన, 2. శాస్త్రవాసన, 3. దేహ వాసనలచేత ఎన్నటికి అపరోక్ష జ్ఞానము కలుగదు. లోకవాసన యనగా ఈ లోకమున తనకు సంబంధించిన వస్తువుల యెడ ప్రీతి. వానిని విడువబుద్ధి పుట్టదు. దేహవాసన యనగా దేహాపేక్ష. దేహ పోషణాసక్తి. శాస్త్రవాసనయనగా శాస్త్రమునందలి ప్రీతిచే శాస్త్రములోనే వాదప్రతివాదములతో గడుపుట శాస్త్ర వాసనయగును. వాసనలే సంసారము. వానిని వదలవలెను. అదియే సంసార త్యాగము. వాసనా త్యాగము వల్లనే పరమ శాంతి కలుగును. లోపలనున్న అజ్ఞాన నాశనమునకు శబ్దజన్య జ్ఞానము వ్యర్థము.

సంసారమనునదియొక బందీ గృహము. అందులో వాసన త్రయ మును ఇనుప సంకెళ్ళు పాదములయందు తగులుకొని యున్నవి. విముక్తి బడయవలెనన్న వాసనా త్రయమను సంకెళ్ళను దునుమాడ వలయును. కారాగృహప్రాప్తి ప్రభువు యొక్క ఆజ్ఞను మీరిన వారికి అపరాధము చేసినవారికి కలుగును. అటులనే ఈశ్వరుని ఆజ్ఞను మీరినవారికి సంసార కారాగృహ ప్రాప్తి కలుగుచున్నది. వీరిలో గొప్ప అపరాధము చేసినవారికి కాళ్ళకు గొలుసులు తగిలింతురు. బందీగృహములకు కిటికీలు కూడా ఉండవు. ఆ ప్రకారము ఎక్కువ కర్మలు చేసిన వారిని పెద్ద సంసారములో పడవైచి జ్ఞానమనునదిలేక వాసనా త్రయమను దృఢ తరములయిన ఇనుప సంకెళ్ళను తగిలించుచున్నారు. తక్కువ ఆజ్ఞను మీరినవారికి విశాలమయిన వెలుతురు కలిగిన చెఱసాల విధింతురు.

పుణ్యాత్ములు కొంతకాలము వరకే సంసార బందీగృహములో నుందురు. వీరు వాసనాత్రయ, ఈషణత్రయ, గుణత్రయముల నంటక స్వరూప స్థితిలో నుండి ముక్తులగుదురు. అంతఃకరణ మనునది అగరువత్తులకట్ట. అది అజ్ఞానజలముచే తడిచి జడమయినది. అందు మలిన

వాసనలు చేరుకొనియున్నవి. ఈ అంతఃకరణమునకు జ్ఞాన జ్యోతియొక్క సంబంధము కలుగగా మలిన వాసనలు నశించి విజ్ఞానమయమై ప్రకాశించుచున్నవి. ఈ ప్రకారము మలిన వాసనలు నశించిన జన్మరహిత సంస్కారములు బయలుపడును.

అంతఃకరణమున అంతము లేనివై నాశము జేయ కష్టసాధ్యములై జన్మ పరంపరలనుండి వచ్చుచున్నవై పునర్జన్మ కారకములై అజ్ఞానజన్య మలిన వాసనలున్నవి. అటులనే అనేక కాల ధ్యానాదులచే విచారణలచే సాధనలచే జన్యమగు పరబ్రహ్మ వాసనయు హృదయములో సంస్కార రూపముగానున్నది. ఈ వాసనయు అనేక జన్మలనుండి వచ్చుచునే యున్నది. వాసనయనగా అనేక జన్మల నుండి వచ్చుచున్న దనియే యర్థము. మలిన వాసనలను ధూళి శుద్ధ వాసనను చుట్టియున్నది. అందుచే ఆ వాసన బయట పడుటలేదు. దుష్టవాసనా సంపర్కముచే పరబ్రహ్మ వాసన తెలియబడకున్నది.

ఆత్మ సంస్కారము విద్యాజన్యము. అనాత్మ సంస్కారములు అవిద్యా జన్యము. అనాత్మ వాసనలు దేహమునాది, దేహేంద్రియాదులు నేను అను మలిన సంస్కారములు, అనాత్మ భావనలు జన్మ జన్మాంతరముల నుండి ప్రబలి యున్నందున అప్పుడు ఆత్మ ధ్యానము స్థిరముగా చేయనందున, పరమాత్మ జ్ఞానము జన్మ జన్మాంతరముల నుండి స్వల్పముగా యున్నందున మరగుపరచుచున్నవి. అందుచే జనుడు ఆత్మను తెలియకయున్నాడు. అఖండప్రజ్ఞ కలుగునప్పుడే నేను బ్రహ్మనను భావము దృఢపడి సంపూర్ణమై ప్రకాశించుచున్నది. ఇట్టి శుద్ధ సంస్కారమే జ్ఞానము. పరిపూర్ణ బోధజనకము. పునరావృత్తి రహిత సంస్కారము దీని చేతనే మోక్షము.

నేను నావియను అనాత్మ సంస్కారములు ఉన్నందుచేతనే కొందరు అజ్ఞానులుగను మరికొందరు జ్ఞానులుగను కనబడుచున్నారు. అనాత్మ వాసనలు దేహమునాది వస్తు సంచయమునాది దేహేంద్రియాదులు నేను మొ॥ మలిన సంస్కారములు అనాత్మ భావనలు జన్మజన్మాంతరముల నుండి ప్రబలియున్నందున అప్పుడు ఆత్మధ్యానము స్థిరముగా చేయనందుచే పరమాత్మ జ్ఞానము జన్మ జన్మాంతరముల నుండి స్వల్పముగా నున్నందున

మరుగుపరచుచున్నవి. అందుచే జనుడు ఆత్మను తెలియకయున్నాడు. వీడు అజ్ఞాని ప్రయత్న పరుడగు ఆత్మవివేకి. ఈ రహస్యము నేరిగి దృఢతరము లయిన బలవత్తరములయిన అనాత్మ వాసనలన్నింటిని తనలో తాను చూచుకొనుట చేత ఆత్మ విచారముచేత నిశ్చల సమాధి చేత నశింపజేయు చున్నాడు. అప్పుడు బ్రహ్మాకార వృత్తిరూప శుద్ధ వాసన విరాజిల్లుచున్నది. స్వయం జ్యోతి బయలు పడుచున్నది. కావున ఆత్మ భావనచే అనాత్మ భావనలను దరిచేరనీయక నిరంతరము దూరీకరించుచుండిన ఆత్మ వస్తువు స్వయముగా ప్రకటితమగును. ఇదియే పరమాత్మ ప్రాప్తి. మలిన వాసనలను వృత్తులను సంకల్పములను గుణములను త్రోసిపుచ్చి ఆత్మ విచారణ ధ్యానాదులను బలపరచుచున్నాడో అంతకంతకు దైవమును చేరుచున్నాడని తెలియవలయును.

మేఘాచ్ఛాదనము మెల్లమెల్లగా తొలగుచుండిన సూర్యకిరణములు బయలుపడుచుండును. మలిన వాసనాజాల మేఘావరణము తొలగుచుండిన పరమాత్మ భాస్కరుని జ్ఞానకిరణములు ప్రకటమగు చుండును. అవిద్యా చ్ఛాదనము నశించగా పరిపూర్ణ పరమాత్మజ్యోతి భాసిల్లును. రాహువుచే గ్రహించబడిన చంద్రుడు రాహు గ్రహము తొలగుచుండగా చంద్రుడు మెల్లమెల్లగా బయటపడును. అలాగున అశుద్ధవాసనలు నశించుచుండగా ఆత్మ ప్రకాశించుచుండును. నేత్రమునకు పటలమున్నప్పుడు చూపు మసకగా మందముగా నుండును. పటలము నశించగా నయనము శుద్ధమై సమస్తమును చూడగలుగును. అనాది మాయయగు నిద్రయందు శయనించు జీవుడు ఎప్పుడు ప్రబుద్ధుడగునో అప్పుడే అద్వైత మెరుంగబడుచున్నది. వాసనల సముదాయమే మనస్సు. జలములో ఉప్పువలె పరమాత్మయందు చిత్తము స్వరూపములేనిది యగుచున్నది. ఎంతకంతకు మనస్సు పరమాత్మ యందు దృఢముగా నిలచునో అంతకంతకు ప్రపంచ వాసనలు విషయ సంస్కారములు నాశనమగుచునేయుండును. పరమాత్మ సన్నిధికి అంతః కరణము చేరుకొలది అజ్ఞానరహితమగుచున్నది. అవిద్యా జనితమగు హృదయ క్షేత్రమున జీవుడను శుకము వాసనాజాల పంజరములో నివసించుచున్నది. ఈ పంజరమునకు సంకల్పములు పుల్లలుగానున్నవి.

సంకల్ప వికల్పములను శలాకములను (పుల్లలు) తెగగొట్టిన వాసనా పంజరము నశించుచున్నది. తరువాత జీవుడు బంధ విముక్తుడై స్వేచ్ఛగా విహరించును. పంజరమునుండి విడివడిన చిలుక స్వేచ్ఛను పొంది తనకిష్టమగు పండ్లను భక్షించి గగనమున విహరించును. వాసనా విముక్తి లేనిదే ఆత్మానుభవము కలుగజాలదు. వాసనలను వదలిన మహానుభావుడే నిరామయుడు. సంస్కారములు వేరు మనసు వేరుకాదు. సూక్ష్మ సంస్కారములు చేరి మనసు తయారగుచున్నది. వాసనలు నశించుటయనగా మనోనాశనము. అదియే అమనస్కము.

యోగి కార్యమేమనగా మనస్సును స్వరూపము లేకుండా చేయుటయే మనస్సు సకల అనర్థములకు హేతువు తన నిత్య సుఖరూప మోక్షమునకు ప్రతిబంధము. మనస్సు సదా పరమాత్మయందే నిలుపవలయును. నవనీతము మాడ్కియున్నది శుద్ధమనస్సు ఆ శుద్ధ మనస్సు రాగివలెయుండును. అగ్నిలో కరగించిన రాగి కూడా ద్రవముగా మారును. రజోగుణయుక్తము. ఇట్టి మనస్సును ప్రాణాయామ ధ్యానాది యోగాగ్నిలో కరగించిన అతిశుద్ధమై సూక్ష్మమై పరమాత్మలో కలియును. ఉక్కువలెనుండునది. అత్యంత అశుద్ధమైన మనస్సు. ఉక్కును కూడా కరగించుచున్నారు. తమోగుణ మనస్సును తీవ్రతరవ్రతములు జపతపాదులు సల్పి సూక్ష్మస్థితిని పొందవలెను. త్రివిధరూప మనశ్శుద్ధికై 1. కర్మ 2. ఉపాసన 3. జ్ఞానము లత్యావశ్యకములు. కర్మయోగము చిత్తశుద్ధికి, భక్తియోగము చిత్తైకాగ్రతకు, జ్ఞానయోగము మోక్షము కొరకు ఆచరింపవలయును. ఈ ప్రకారము మనోనాశము చేయవలయును. ఒక క్రియ రెండు పనులు అనగా మనోనాశము వాసనా క్షయము కలుగుచున్నది. వాసనా నాశముచే చిత్తనాశము అద్దానిచే పరమాత్మ ప్రాప్తియుకలుగును.

శ్రీ గురుభ్యోనమః

గుణత్రయము

ఈచరాచర జగత్తు ప్రకృతి పురుషుల యొక్క సంయోగము వలన కలుగుచున్నది. అనగా జడమగు ప్రకృతిలో చైతన్య రూపుడగు పరమాత్మ యొక్క కలయిక చేతనే సృష్టి ఏర్పడుచున్నది. కనుక పరమాత్మయే సర్వజీవులకు బీజము. కాబట్టి ఏ ప్రాణియు తాను అల్పజీవినని భావించక తనమూలము పరమాత్మయే అని ఎరిగి అతనిని చేరుటకు అతనిలో లీనమగుటకు జ్ఞానాదుల ద్వారా సర్వ ప్రయత్నములు గావించ వలయును. ప్రకృతి నుండియే సత్వరజస్తమో గుణములు ఆవిర్భవించి జీవుని బంధమునకు అవియే కారణమగుచున్నవి.

గుణత్రయమనగా సత్వగుణము, రజోగుణము, తమోగుణము ఈ మూడును ప్రకృతి వలన కలిగినవే. రజోగుణమున్నప్పుడు జీవుడెట్లుండునో చూడుడు. రజోగుణము అభివృద్ధి పొందునపుడు మనుజునియందు లోభత్వము కార్యములయందు ప్రవృత్తి, కామ్య నిషిద్ధ కర్మలను ప్రారంభించుట. ఇంద్రియ నిగ్రహము లేకుండుట, మనశ్శాంతి లేకుండుట, ఆశా అనునవి కలుగుచుండును. రజోగుణము రాగాత్మకము. దృశ్య విషయముల యెడల ప్రీతిని కలుగజేయును. బాహ్య ఆడంబర కర్మలచేతను, విషయాసక్తిచేతను, ఖ్యాతిని అర్జించవలెనను ప్రయత్నము చేతను రజోగుణము జీవుని బంధించుచున్నవి.

రజోగుణమునకు రావణాసురుని దృష్టాంతముగ చెప్పవచ్చును. విక్షేపశక్తి రజోగుణ ప్రధానమైనది. మాయ యొక్క క్షోభరూపమగు విక్షేపశక్తి జీవులకు ప్రవృత్తిని మనస్సునకు దుఃఖాదులు రాగాదులు కలిగించుచున్నవి. రజోగుణ ధర్మములయిన కామక్రోధాదులు, అసూయ అహంకారాదులు సంసార రూప బంధమునకు ప్రధానకారణము.

తమోగుణము సద్వస్తువగు పరబ్రహ్మను మిథ్యగను మిథ్యా రూపమగు జగత్తు సత్యముగను తోపింపగజేయును. రజోగుణము విక్షేపశక్తిని తమో

గుణము ఆవరణశక్తిని కలిగియున్నది. ఆవరణ శక్తి విక్షేపశక్తికి కారణ మగుచున్నది. తమోగుణము రజోగుణమునకు హేతువు. ఇది కారణ శరీరమునకు సంబంధించినది. స్వస్వరూప జ్ఞానము చేతనే ఇది నశించును. అంతఃకరణమున మల-విక్షేప-ఆవరణ దోషములు తమోగుణమునకు సంబంధించినవి. బ్రహ్మజ్ఞానము చేతనే ఇవి నశించును.

తమో గుణము అభివృద్ధిపొందునపుడు జీవునియందు మత్తు సోమరితనము, అజాగ్రత్త, బుద్ధి మాంద్యము మున్నగు లక్షణములు గోచరించుచుండును. అజ్ఞానముతో నిండిన తమోగుణ సంపన్నుడు గానుగెద్దులాగ కఠిన చీకటివంటి దుర్భరజీవితము గడిపె నిర్భాగ్యజీవి. వివేకవంతులు, ఆత్మజ్ఞాన సంపన్నులు తప్ప తమోగుణము అందరిని ఆవరించును. ముముక్షువులగువారు వారి ప్రయత్న తీవ్రతనుబట్టి అది తొలగిపోవుచుండును.

ప్రజ్ఞావంతుడయినను, నేర్పరియైనను, శాస్త్రజ్ఞానము కలిగియున్న సద్గురువులచే శ్రుతి స్మృతి యుక్తులచే అనేక ప్రకారముగ ఉపదేశించబడిన వాడయినను తత్వము నెఱుంగ జాలడు. ఎందుచేతననగా అతను భ్రాంతుడు. భ్రాంతిచే కల్పింపబడిన జగత్తుయందు ఆత్మ వస్తువును అనాత్మగా భావించుచున్నాడు. ఎడతెగని తమోగుణముయొక్క ఆవరణశక్తి గొప్పది కదా! పండితులనుగూడ ఈ మాయ మ్రింగుచున్నది. ఈ ప్రకారము ఆవరణశక్తి ప్రబలమని తెలియదగినది.

సత్వగుణము స్వచ్ఛజలమువలె మిగుల నిర్మలమయినది. అయినను అది రజస్తమోగుణములతో కలిగియున్నప్పుడు ఆ మిశ్రమ సత్వగుణము ఆత్మ ప్రతిఫలించుటకు స్థానమగుచున్నది. సత్వగుణము ప్రధానముగను రజస్తమోగుణముల ప్రధానముగను ఉన్నప్పుడు అంతఃకరణమున ప్రతిఫలించిన ఆత్మ (జీవాత్మ) సమస్త జడపదార్ధములను తద్వృత్తులను తెలియుచున్నది. చైతన్య పదార్ధము బింబము అదియే అంతఃకరణమున ప్రతిఫలించిన ప్రతిబింబమనబడుచున్నది. మిశ్రమ సత్వగుణముగలవారికి ఆత్మ విషయము స్ఫురించుననని భావము. గుణములు మూడును ప్రకృతి

జన్యములగుటవలన సత్వగుణముకూడ అందుచేరియుండుటవలన అదియు మాయయొక్క ఒకానొక భాగమే!

సత్వగుణము శుద్ధమైనది. అది నిర్మలమగుటచే తక్కిన రెంటి కంటెను శ్రేష్ఠమైనది. దీపమునకు తెల్లటి గ్లాసు నిర్మలముగగానున్నప్పటికి అదియు ఒకానొక ఆవరణమేయగును. అట్లే సత్వగుణము సుఖాసక్తిచేతను జ్ఞానాసక్తి చేతను ఆత్మను బంధించుచున్నది. కావున అద్దానినికూడదాటి ఆ బంధము కూడా వదలించుకొని కేవలాత్మస్థితిని పొందవలయును. సత్వగుణము ప్రాపంచిక సుఖమునందును, రజోగుణము ప్రాపంచిక కర్మయందును, తమోగుణము నిద్రాల సతలయందును జీవుని చేర్చుచున్నది. మూడును జ్ఞాన దీపమును, ఆత్మ దీపమును ఏదోవిధముగ కప్పినవే అయివుండుటచే వానినిదాటి జీవుడు ఆత్మస్థానమును చేరవలసియున్నది.

సత్వరజస్తమోగుణములు మూడును ప్రకృతివలన కలిగినవి. అవి ఆత్మకు లేవు. ఆత్మ నిర్గుణుడు. గుణాతీతుడు. జీవుడు తనయధార్థ స్వరూపమగు ఆత్మను విస్మరించి తాను సత్వాదిగుణములు కలవాడనని భావించి ఆగుణములతో తాదాత్మ్యమునొందుచు దేహమునందు సంసారమునందు బంధితుడగుచున్నాడు. ఈ మూడు గుణములలో ఏ ఒక్క గుణమున్నప్పటికి జీవుడు ప్రకృతి(మాయ) యందేయున్నాడనియు మాయా తీతమగు ఆత్మనింక చేరలేదనియు తెలిసికొనవలసియుండును. దీనినుండి విడుదలబొందుటకై అతడు అహర్నిశలు ప్రయత్నపరుడు కావలసియున్నది. రజస్సు తమస్సుతోపాటు సత్వగుణముకూడా జీవుని బంధించుచ్నుది. ఏలయనగా పూర్ణ నిస్సంకల్ప స్థితియందు నిర్వికల్పావస్థయందు ఏగుణమున్ను యుండదు.

జీవుడు చేయు సమస్త కర్మములకు త్రిగుణాత్మకమగుమనసే కర్త ఆ త్రిగుణములే ఆ మనస్సే దేహేంద్రియాదులచే కర్మలను చేయించుచున్నది. బంధమునకు కారణము మనస్సే. మోక్షమునకు కారణము మనస్సే. కర్తభోక్త దానికంటే వేరుగలేదు. ఆత్మసాక్షిగా వర్తించును. కావున జీవుడు వివేకముచే తాను గుణములకంటె వేరుగానున్నాననియు, దేహేంద్రియాదులకు సాక్షియగు

ఆత్మయే తాననియు ఎప్పుడు తెలిసికొనునో అప్పుడే యాతడు ద్రష్టగ దృగ్రూపుడుగ శేషించి పరమాత్మరూపమునే పొందుచున్నాడు.

ప్రారంభములో రజస్సు తమస్సులను దాటి సత్వగుణావస్థను పొంది దానినికూడదాటి నిర్వికల్పస్థితిని చేరవలసియున్నది. ప్రపంచములోని సమస్త దృశ్య పదార్ధములు నశ్వరములు, ఆత్మయొకడే శాశ్వతుడు ప్రతివారు తనస్థితిని విచారించుకొని దేహస్థితియందున్నచో త్రిగుణములను క్రమముగ రహిత మొనర్చుకొని స్వస్వరూప స్థితిని అనుభవించవలెను. నిరంతర పరమార్ధసాధన వలన జీవుడు క్రమ పరిణామమొంది రజస్తమముల నుండి సత్వము నందుకొని అటనుండి గుణాతీతపదవిని చేరుకొనును. సత్వ గుణమునకు విభీషణుని తమోగుణమునకు కుంభకర్ణుని దృష్టాంతముగ చెప్పవచ్చును.

ఒక్కొక్క గుణము అధికముగానున్నప్పుడు జీవుడు ఒనర్చు కర్మము దాని కనుగుణముగనే యుండును. అతడు భుజించు ఆహారము మాట్లాడు పద్ధతి నడక సమస్తము ఆ గుణముల ననుసరించియే యుండును. అనగా సత్వగుణమున్నప్పుడు జీవుని సమస్త చర్యలు సాత్వికముగ జ్ఞానవంతముగా యుండును. ప్రశాంతముగ మాట్లాడును. సాత్వికాహారము భుజించును. ఉత్తమ గ్రంధములను చదువును. ఈ ప్రకారముగ ప్రశాంతత జ్ఞానప్రకాశము సమస్త ఇంద్రియములనుండి ఎపుడు వెల్లివిరియునో అపుడా వ్యక్తియందు సత్వగుణము అధికముగా నున్నదని గ్రహించవచ్చును.

రజోగుణమునందున్నవాడు లేనిపోని వ్యవహారములు నెత్తిన వేసుకొనును. అతనికి శాంతియుండదు అతని ఆహారము రాజసముగనే యుండును. హృదయమున విషయాశలుండును. ఇంద్రియ నిగ్రహముండదు.

అంత్యకాలమున చిత్తమున సత్వరజస్తమోగుణములలో ఏయే గుణము లధికముగానుండునో తదనుగుణ్యమైన జన్మ కలుగును. జీవితమంతయు మంచి సంస్కారములు ఏర్పడుటకు ఎంతయో సాధన ప్రయత్నము అవుసరము. పుణ్యకార్యమును పరోపకారభావనలు గలిగియుండిననే చిత్తము సత్వగుణామయముకాగలదు. దానినుండి విశుద్ధ సత్వగుణమున్ను సంపాదించుటకు యత్నశీలుడుకావలెను.

శ్రీ గురుభ్యోనమః

ఆత్మ స్వరూప నిరూపణ

వేదాంతులు పరబ్రహ్మము పరిపూర్ణమని చెప్పుదురు. ఇందులకు శ్రుతి "అన్తఃపూర్ణః బహిఃపూర్ణః పూర్ణకుమ్భ ఇవార్ణవే" ఇందులకు శూన్యపాదులు "అన్తఃశూన్యఃబహిఃశూన్యఃశూన్యకుమ్భ ఇవాంబరే" అంతయు శూన్యమేయని చెప్పుదురు. గురువుద్వారా శిష్యుడు వేదాంత తత్వమును శ్రవణము చేసెను. దీనిచే శిష్యునికి అనర్థ నివృత్తి కలిగినది కాని ఆనంద ప్రాప్తి కలుగలేదు. నిధి కున్న అడ్డుతొలగించిన చాలదు. దానిని పొంది ఉపయోగ పరచుకొన్న పుడే సుఖము. ఆవరణ తొలగిన చాలదు. పరమాత్మ ప్రాప్తిచే ఆనందము ప్రాప్తించును. అతను సర్వదా తృప్తుడు. ఆ తృప్తికి అంతములేదు.

అహంకార మమకారములు గాని వాని అభావములుగాని ఈ శరీరాంతఃకరణములయందు జరుగునదంతయు ఏది తెలియుచున్నదో, దానిని మఱి యొకడు తెలియజాలడో అటులనే సమస్తము దేనిచే అనుభవింప బడుచున్నదో, అదిమాత్రమెవనిచేతను అనుభవింపబడదో అదియే ఆత్మ. సమస్తమును గుర్తెరుంగునదిదియే. అట్టి పరమాత్మను సూక్ష్మబుద్ధిచే తెలిసికొన గలుగుదురు. ఆ ఆత్మను దేనిచేత తెలుసుకొనజాలరు. అదియే సమస్తమును తెలియుచున్నది. ఆపరమాత్మను సూక్ష్మదర్శులగు మహాత్ములు తీక్ష్ణ సూక్ష్మబుద్ధి చేతనే గాంచుచున్నారు.

లోకములో ఏయే పదార్థము ఎవని వలన అనుభవింపబడునో ఆయా వస్తువునకు అతడు సాక్షియగును. లోకములో ఒకనొక పురుషుని యొక్క అవస్థలను, అవస్థా వ్యాపారములను సాక్షాత్తుగా చూచుటయే సాక్షిత్వము. లోపలనున్న ఆత్మ (అంతరాత్మ=జీవుడు) స్వయముగా సర్వసాక్షి. అతనికన్న మఱియొకడు లేడు. ఆత్మదృక్ మిగిలినదంతయు దృశ్యము. కనుక ఆత్మయే సర్వసాక్షి. ఆ పరమాత్మ మూడు అవస్థల యందు స్ఫుటముగా ప్రకాశించు

చున్నాడు. అంతఃకరణమున అంతరాత్మయై అధిష్ఠానమై అందరి హృదయము లలో నేను నేను అనుచున్నాడు.

ఈ స్థూల ప్రపంచము స్థూల శరీరము ప్రత్యక్షమే. అనగా గోచరించునది. స్థూల శరీరములో సూక్ష్మ శరీరము కలదు. అదియే అంతః కరణము. దీనిలో వాసనలను, వికారములను తెలియువాడు ఒకడున్నాడు. అంతఃకరణమునకు ఆధారభూతుడై, విలక్షణుడై సోఽహం, సోఽహం అని స్వయముగా అనుచున్నాడు. వాడే నేను వాడే నేను ఈ అనాత్మ పదార్థములు నేను కాను యని అనుచున్నాడు. ఇదియే సోఽహం భావరహస్యం. దీనిని తెలియటమే స్వస్వరూపస్థితి.

ప్రపంచ జ్ఞానము లేని మందుడు (బాలుడు) జలములోని సూర్య ప్రతిబింబమును జూచి సూర్యునిగానే తలంచును. సూర్యుడయినచో కిరణము లేవి? ప్రకాశమేది? అతని సంసారమెక్కడ? తమస్సును నాశనము చేయగలడా అను విచారము ఆమూఢునికి తెలియదు. జడమతిగల అజ్ఞాని అనగా జ్ఞాన శూన్యుడు చైతన్యాభాసమును తెలియజాలడు. జీవుడనగా కేవల కూటస్థాత్మ అతనికి అజ్ఞానములేదు. సదా ప్రకాశించువాడు. కూటస్థాత్మ రూప జీవుడే పరమాత్మ. ఈలాటి జ్ఞానము జ్ఞానశూన్యునికి తెలియదు.

అంతఃకరణము జడము. కనుక వేదాంత శాస్త్రము జీవుడనగా అంతః కరణము, ప్రతిబింబచైతన్యము, కూటస్థాత్మ మూడును చేరి జీవుడుగా నిశ్చయించెను. అంతఃకరణము నేత్ర వృత్తి ద్వారా బయటి వస్తువుల రూపము ధరించును. అంతఃకరణమే బింబరూపము దాల్చి ప్రతిబింబమైనది. ఇదియే బింబ ప్రతిబింబముల రహస్యము. బింబము కన్న ప్రతి బింబము వేరుకాదు. జీవుడు పరమాత్మ కన్న వేరుకాదు. దీనినే అచల వేదాంతులు దర్పణ భావ రహస్యము అందురు. బింబ ప్రతిబింబములు 1)బింబము సూర్యుడు 2) ప్రతిబింబము 3)జలోపాధి 4)ఘటోపాధి 1) శరీరము ఘటోపాధి 2) అంతః కరణము జలోపాధి 3) చిదాభాసుడు ప్రతిబింబము 4) కూటస్థాత్మ బింబము.

వీటన్నిటికిని ఆధారము మరియొకడు గలడు. అతడే పరబ్రహ్మము. ఆ పరబ్రహ్మమే సర్వాధిష్ఠానము. ఇదియే సద సద్విలక్షణము. వ్యవహార తీతము. దేహము-బుద్ధి-ప్రతిబింబము ఈ మూడింటిని ప్రకాశింపజేయుచు, సమీపవర్తియై, సాక్షియై స్వయం ప్రకాశమాన పరమాత్మయున్నాడని బ్రహ్మజ్ఞాని తెలియుచున్నాడు.లోకములో జ్ఞానులు,అజ్ఞానులు అని ఇరుతెగల వారున్నారు.

<u>1. అరోచకులు</u> : అనగా జ్ఞానులు. వీరు అన్నములోని వ్యర్థ పదార్థములను దూరీకరించి భుజించెదరు. వీరు శరీరాది జడ పదార్థములను వేరుగాచేసి చైతన్యమును కనుగొనువారు. 2) సతృణాభ్యవహారిణచ్చ-వీరు విమర్శనా జ్ఞానము లేనివారు. అన్ని పదార్థములను కలిపి తిందురు. శరీరము, అంతః కరణము బింబ ప్రతిబింబములను ఏకముగా భావించెడివారు. రత్న పరీక్ష తెలిసినవారు. రాళ్ళ నుండి రత్నమును వేరు చేయుదురు. ఇదియే జ్ఞానికి అజ్ఞానికిగల భేదము. మనస్సు రాజు, బుద్ధి మంత్రి, మనస్సనేరాజు సంకల్ప వికల్ప వృత్తియను వేషము ధరించియున్నాడు. మంత్రియనే బుద్ధి నిశ్చయ రూప వృతియను వేషములో ఉన్నాడు. శరీరమనునది నాటకశాల. అంతః కరణము నాటకశాల ముంగిలి ప్రదేశము. ఇంద్రియాలు ఆయా వృత్తుల వేషముతో ఆడుచున్నారు. ఆత్మ ప్రేక్షకుడుగా యున్నాడు. బుద్ధి శుద్ధమై తీక్ష్ణమై సూక్ష్మమైన బుద్ధియందు పరమాత్మ విరాజిల్లుచుండును. సత్తనగా మూడు కాలములలో యుండునది. అసత్తనగా అవ్యాకృతము. రెండింటికి విలక్షణమైనది పరబ్రహ్మము.

ధర్మ అర్థ కామ మోక్షములను నాలుగు పురుషార్థములు కలవు. ధర్మ -అర్థ-కామములను ఏ ఉపాయము చేతనయినను పొందవచ్చును. కాని మోక్షము ఉపాసనల చేత సిద్ధించదు. స్వస్వరూప జ్ఞానము చేతనే మోక్షము సిద్ధించును. పరమ భక్తుడగు ప్రహ్లాదునికి కూడా భగవంతుడు సాక్షాత్కరించి జ్ఞానము బోధించినట్లు ఐతిహాస ప్రమాణము కలదు. గురువులు సమాధిని చూపిరి. అనగా స్వస్వరూపము కనుగొనునట్లు చేసిరి. తన స్వరూపము

తెలియక పోవుటమే అజ్ఞానము. జ్ఞానమనగా తన స్వరూపమును తెలిసికొనుటమే. గ్రంథ కోటులచేత తపస్స్వాధ్యాముల చేత ముక్తి కలుగదు. ఆ పరబ్రహ్మమే పరమ శాంతి ధామము.

ఆ పరబ్రహ్మము సత్యస్వరూపము. మూడు కాలములలో యుండునది. దేశకాలవస్తు పరిచ్ఛేదము లేనిది. పరిశుద్ధమైనది. మాయా మాలిన్యము లేనిది. సత్యమనగా ఏమిటి ? వేదమునందు ప్రతిపాదింప బడినదే సత్యము. ఏదియున్నదో అది సత్యము. భేదశూన్యమైనదే సత్యము. ఈ సత్యమును సత్పురుషులు పొందెదరు. ఇది పరబ్రహ్మ స్వరూప లక్షణము.

పరబ్రహ్మ మేలాటి విషయదోషములు లేనిది వాసనలు, భావనలు మనస్సుకు సంబంధించినవి జగమంతయు పరబ్రహ్మమే దర్పణము నందు మాలిన్యమున్నంతవరకు ప్రతిబింబము, నేత్రముల యందు రోగమున్నంతవరకు యథార్థము గోచరించదు. అది తొలిగిన అంతయు బ్రహ్మమే. దృష్టిని బ్రహ్మమయముగ చేసిన జ్ఞాన దృష్టి ఏర్పడును. కారణము యొక్క రూపమే కార్యము కార్యమగు జగత్తు కారణమగు పరబ్రహ్మ వేరుకాదు. కార్యోపాధి జీవుడు కారణోపాధి ఈశ్వరుడు. కార్యకారణములు విడచిన పరిపూర్ణము మిగులును ఇదియే జీవేశ్వరైక్యము, తత్త్వమసి లక్ష్యార్థము.

త్రికాలములయందున్నది ఆపరబ్రహ్మమే మిగిలినవి ఒకప్పుడుండును మరియొకప్పుడుండవు. సకల భూతములు అవ్యక్తము నుండి జనించి మధ్యలో ప్రకటితములై తరువాత అవ్యక్తములోనే కలిసిపోవును. పరబ్రహ్మము పరిపూర్ణము, నిష్కళంకము నిరీహము, నిరంజనము, నిర్వికారము, నిర్గుణము, నిరూపము.

పరిపూర్ణము అనగా అంతటా నిండి యుండునది. అపార సముద్రము బయట లోపల జలపూరిత మగునటుల చైతన్యముచే పరిపూర్ణము. సర్వవ్యాపకమై దేశకాల పరిచ్ఛిత్తిలేక అఖండమైయున్నది బ్రహ్మము

అనాద్యంతము, అప్రమేయము. అనాద్యంతమనగా ఆది అంతములు లేనిది. మొదలు - మధ్య - కొసలు లేవు. అప్రమేయమనగా ప్రమాణములకు గోచరము కానిది. ప్రమాణములు ఇంద్రియ గోచరవస్తువులనే తెలుపుచున్నది. ఆ పరమాత్మ ప్రమాణాతీతమై సకల ఇంద్రియాతీతమైయున్నది.

మహాపురుషులు యథార్థ తత్వమునకు, ఈశ్వరునకు, వేదములకు విరుద్ధముగా దేనిని వచింపరు. ఈశ్వరుని, వేదములను ఆధారముగా చేసికొనియే సత్యమును బోధింతురు. కావున జగత్తనగా స్వరూపరహిత వస్తువు. ప్రమాణములు లేవు 'భ్రమమూలమిదం జగత్' = జగత్తు భ్రమయని సిద్ధాంతము. నాయందు ఈ సమస్త ప్రపంచము దారమందు మణులవలెనున్నది అని గీతావచనము. సర్వ భూతములయందు పరమాత్మ నిగూఢుడు. ఆధారాధేయ సంబంధములతో భూతేశ్వరులు లేరు. భూతములు పరమాత్మను ఆశ్రయించియున్న వనియు పరమాత్మ సర్వ వ్యాపకుడని తాత్పర్యము.

పరమాత్మ సజాతీయ, విజాతీయ స్వగత భేద రహితము సర్వ వస్తు జాతుల వలన పరిచ్ఛిన్నుడుగాడు. ఆత్మ జగదాదులవలె హేయ పదార్థము గాదు. దివ్యము దేదీప్యమానము. కనుకనే అన్నింటిని గ్రహించును. దానిని గ్రహించు వస్తువు మఱియొకటి లేదు. ఈ జగత్తు కర్త కలది. కర్తలేనిదే ఉత్పన్నము కాదు. కనుక సర్వేశ్వరుడే కర్త. ఈశ్వరునికి ఉపాధిమాయ. జీవునికి ఉపాధి అంతఃకరణము. ఉపాధులు తొలగిన జీవుడే ఈశ్వరుడు. జీవేశ్వరులు అభిన్నము.

శ్రీ గురుభ్యోనమః

పరోక్ష జ్ఞానం - అపరోక్ష జ్ఞానం

పరబ్రహ్మము సత్యస్వరూపమైయున్నది. నేను ఆ పరబ్రహ్మను అని తన స్వస్వరూపమును తెలిసికొనుటయే జ్ఞానము. అట్టి జ్ఞానము పరోక్షమనియు, అపరోక్షమనియు రెండు విధములుగా నున్నది. 1. పరోక్షజ్ఞానమనగా శాస్త్రయుక్తులతోను గురూపదేశము ద్వారాను ఆత్మ ఇట్టిదని నిర్ణయించుకొనుట యగును. దీనిచేత సంశయములు విపరీత భావనలు తొలగుచున్నవి. 2. శాస్త్రములతోను, గురూపదేశముద్వారాను, యుక్తులతోను నిర్ణయించుకొనినది తనకనుభవసిద్ధమయినచో దృఢత్వము నొందినచో అదియే పరోక్ష జ్ఞానమగును. అనగా పరోక్షజ్ఞానమే అచంచలమై, దృఢమై స్వానుభవసిద్ధమయిననచో అపరోక్షజ్ఞానమని చెప్పబడుచున్నది. అపరోక్షజ్ఞానము యొక్క దృఢత్వమునకై పరోక్ష జ్ఞానము బాగుగా నభ్యసించవలయును. అభ్యాసదశలోనున్నదంతయు పరోక్షజ్ఞానమగును. అభ్యాసము దృఢమై అనుభవ గోచరమగు పరవస్తువు సిద్ధించె నేని అదియే అపరోక్షమగును.

పరోక్షము వృద్ధియగు కొలది అపరోక్షము దృఢమగును. ఈ అభ్యాసరూప పరోక్ష జ్ఞానము శుక్లపక్ష చంద్రునివలె అష్టాంగ యోగములచే క్రమక్రమముగ వృద్ధిపొందును. అష్టాంగములనగా (1) యమములు (2) నియమములు (3)ఆసనము (4)ప్రాణాయామము (5)ప్రత్యాహారము (6)ధారణ (7) ధ్యానము (8) సమాధి. అభ్యాస రూప పరోక్ష జ్ఞానము యమనియమాది ఎనిమిది అంగములచే అర్ధభాగము సిద్ధించుచున్నది. ((1) యమములు-అహింస, సత్యము, అస్తేయము, అపరిగ్రహము, బ్రహ్మచర్యము (2) నియమములు శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము,ఈశ్వర ప్రణిధానము.) ఆ జ్ఞానము అజ్ఞానమును దూరీకరించి కొంతవరకు నిలియునటులగుచున్నది.

అష్టాంగయోగముల తర్వాత సప్తజ్ఞాన భూమికలు. అష్టాంగయోగముల ద్వారా అష్టమినాటికి ప్రతిదినమొక కళ హెచ్చుచు సప్తజ్ఞాన భూమికలచే తిరుగా అభివృద్ధిగాంచునటుల వృద్ధిని గాంచు చున్నది. పూర్ణిమనాటి చంద్రుడు పదునారు కళలతో పరిపూర్ణుడగునటుల అభ్యసించెడి పరోక్ష జ్ఞానము కూడ స్వానుభవమునకు వచ్చునప్పుడు ఋతంభరాప్రజ్ఞాయను పదహారవదానితో కూడి దృఢత్వము నొందుచున్నది. ఈ జ్ఞానము సకల సంసార తాపములను బాపి పరమ శాంతిని కలుగజేయుచున్నది. పున్నమినాడు రాత్రి లేని దగుచున్నది. ఆ విధమున ఋతంభరాప్రజ్ఞ దశయందు మాయాంధకారము లేనేలేదు.

స్వానుభవ అపరోక్ష జ్ఞానము పరిపూర్ణమై వ్యాప్తమగునప్పుడు జగద్భ్రాంతియేలేదు. ద్వితీయ వస్తు స్మరణయు జనించదు. ఇట్టి పరతత్వజ్ఞానముచే విశ్వప్రతీతి మూడు కాలములలోను లేదు. నిర్వికల్ప పరబ్రహ్మకు త్రికాలములయందునున్నదియగును.

మహా వాక్యములలో "అయం ఆత్మా బ్రహ్మ" (సాక్షాత్కార వాక్యము) అయమనగా ఆ అంతరాత్మ స్వప్రకాశము. అపరోక్షము అని తెలియుచున్నది. ఆ పరమాత్మ మహత్తు అణువు పొట్టి పొడుగు ఎఱుపు నలుపు అని ఈలాటి భావములు లేనిది అని బృహ దారణ్యక శ్రుతివాక్యము. ఏ పరబ్రహ్మ వస్తువు ప్రశాంతమైనదో, నిర్మలమైనదో, అద్వితీయమైనదో పరమైనదో అట్టి పరబ్రహ్మమే నీవని గురువు ఉపదేశించుచున్నాడు. దీనివలన శిష్యునకు అపరోక్షానుభవ జ్ఞానముదయించు చున్నది. ఈ జ్ఞానమును తెలుపు ఉపనిషద్వాక్యము "భిద్యతే హృదయ గ్రన్థిః భిద్యన్తే సర్వసంశయాః క్షీయన్తే చాస్యకర్మాణి తస్మిన్ దృష్టే పరావరే"= ఆ పరతత్వమును చూడబడగా హృదయములోని సకల సంస్కారాది ముడులు సర్వసంశయములు బోధింపబడుచున్నవి. నాశముగావింపబడుచున్నవి. సూర్యోదయము కాగానే చీకటంతయు పటాపంచలమగుచున్నది.

సారములేని సంసారమందు మనస్సే సృష్టి కర్త. మనస్సు ఇంద్రజాలకుని వలె పని చేయును. నామరూపాదులు కాలాదులు, జాత్యాదులు నావని భ్రమించి అజ్ఞానులగుచున్నారు. ఆ పరబ్రహ్మము శరీరత్రయమునకు, అవస్థాత్రయమునకు గుణత్రయమునకు విలక్షణుడని తెలియుటయే అపరోక్ష జ్ఞానము. జననమరణ సుఖదుఃఖములు లేనిదియు, జాతినీతికుల గోత్రములు లేనిదియు, జగత్తునకు కారణమైనదియు ఆ పరబ్రహ్మమే నేనని తెలియవలయును.

బ్రహ్మ స్వరూపము మనస్సుకు (అంతరేంద్రియములకు) వాక్కుకు (కర్మేంద్రియములకు) నేత్రములకు (జ్ఞానేంద్రియములకు) గోచరము కానిది. ప్రమాణములకు గోచరము కానిది. అనగా అప్రమేయము. దేశకాలవస్తు పరిచ్ఛిన్నము గానిది. అంతయు నిండియుండునది. అఖండము అని యర్థము. బ్రహ్మము అతీంద్రియము గనుక విమల జ్ఞాన దృష్టిచే గోచరించును. అనగా అతీంద్రియ జ్ఞానముచే తెలియును వేదవాక్కులు పరబ్రహ్మ ప్రాప్తుపాయమును తెలుపుచున్నవి. కాని ఆ వాక్కులే బ్రహ్మము గాదు. వాచ్యార్థముతో పరబ్రహ్మము బోధితముగాదు. లక్ష్యార్థము చేతనే వేద్యమగునది.

ఈశ్వరుడు మాయోపాధికుడు కానిమాయకు లోబడుకయున్నటు ఈశ్వరుడు సగుణుడా! నిర్గుణుడా అంటె ఈశ్వరుని వాక్యములను విచారింతము. వేదవాక్కులన్నియు భగవంతుని వాక్యములే. "సత్యం జ్ఞానం అనన్తం బ్రహ్మ, విజ్ఞానం ఆనందం బ్రహ్మ" మొ॥ మహావాక్యములు ఈశ్వరుని శుద్ధ చైతన్యముగ ప్రతిపాదించుచున్నవి.

ఆ పరవస్తువు షడూర్మ్ములు లేనిది. ఇవిలేనివాడు శివుడు షడ్భావ వికారములు లేనిది. ద్వంద్వములకు అతీతమైనది. ఏకమైనది. సృష్టి స్థితిలయములకు హేతువైనది. అదియే అఖండ విజ్ఞానము. సముద్రమునుండి అలలు పుట్టుచున్నవి. క్షణములో లయించుచున్నవి. వాటికాధారము సముద్రమే అటులనే ఆ పరబ్రహ్మముయందు సకలము జనించి అందులోనే

లయించుచున్నది. దానికి ఆధారము అయఖండ పరబ్రహ్మమే. సృష్టిచింతన లయచింతన సాంఖ్యముచే తెలుపబడియున్నది. అంతయు బ్రహ్మస్వరూపమని తెలిపెడి రహస్యము తత్త్వమసి= అదినీవయితివి. దీనికి తార్కాణము భ్రమర కీటక న్యాయము

సముద్రము పెద్ద పెద్ద అలలతో చపలమైనదివలె కనపడుచున్నది. మధ్యభాగమునకుపోయిన దాని రూపము నిశ్చలము గంభీరము. అపారము అటులనే అంతఃకరణముయొక్క అలల పరంపరవలన బేధముగ అగుపించుచున్నది. సంకల్ప సముదాయమున్నప్పుడు అనేక జన్మలు కలుగుచున్నవి. ఆ సంకల్పములు పోయిన జన్మలు లేవు. జ్ఞానదృష్టికి పోయిన ఇది సముద్రము యొక్క మధ్యభాగము పరబ్రహ్మము బంధరహితము. ముక్తస్వరూపము.

పరబ్రహ్మమునకు మరియొక కారణవస్తువు లేదు. తనకు తానేకారణము. నిరుపాధికమగు పరబ్రహ్మము కార్యకారణ విలక్షణము. కార్యము జగత్తు. కారణము మహాదాది మాయ. ఈ రెంటికి విలక్షణము బ్రహ్మము స్వయముగ ప్రకాశించుచున్నది. ఆ బ్రహ్మము నీవని అనుభవపూర్వకముగా తెలియుటయే అపరోక్షజ్ఞానము. సకల భూతములు క్షరములు (నశించునవి) కూటస్థుడు అక్షరుడు. ఈ క్షరాక్షరముల కతీతుడు పరమాత్మయని చెప్పబడియె. "నేను క్షరమునతి క్రమించినవాడను, అక్షరముకంటె ఉత్తముడను నేను లోకమునందున వేదమునందున ఉత్తమ పురుషుడనని ప్రసిద్ధుడను" అని కృష్ణస్వామి వచనము (శ్రీభగవద్గీత).

పసిడియందు ఉంగరము, కడియము మొ॥ అనేక రూపములుగా నామములుగా వ్యవహరింపబడుచున్నదో, పసిడి మాత్రము వికారము లేకయున్నది వస్తువులు వికారమును చెందుచున్నవి. అటులనే నామరూపగుణ వికారాత్మకమగు ఈ జగత్తు నానావిధము వికారసహితము. పరబ్రహ్మము మాత్రము సదా నిర్వికారము. ఓ శిష్యా నీవు నిర్వికారుడవై ద్వంద్వాత్మక

ప్రకృతినంటక స్వస్వరూప స్థితిలో నుండుమాయని గురుదేవుని పరమమోపదేశము ఒకే బంగారు అనేక ఆభరణములుగా, ఒకే మట్టి అనేక ఘటములుగా గోవులనేకము పాలు ఒకే వర్ణము. ఒకే పరమాత్మ అనేక దేహములయందున్నాడు. అనేక వర్తియయినను పరబ్రహ్మ అవికారి. మార్పును చెందుటలేదు.

ఆ పరబ్రహ్మము అంతయు తానైయున్నది. తనకంటె భిన్న వస్తువు లేనిది. ప్రకృతికి పరమైనది. స్వస్వరూపమే లక్షణముగా కలది. సచ్చిదానందమైనది. అట్టి బ్రహ్మము నీవు కాన, స్థిర మతితో నిరంతరము దానిని నిలుపుమని గురువుయొక్క ఆదేశము. శ్రుతి ప్రమాణములతోను, యుక్తితోను స్వానుభవముతోను దృష్టాంతములతోను గురుదేవుడువిశదీకరించి యున్నాడు. ఇదియే విముక్తిమార్గము. వేదాంతమకుటము. "తత్త్వమసి" యను ఉపదేశ వాక్యముచే "అహంబ్రహ్మాస్మి" అను అపరోక్షజ్ఞానము కలుగు చున్నది.

తాను పరబ్రహ్మమేయని తెలివిగలిగిన తర్వాత తాను ఇదివరకు ఎన్ని జన్మలెత్తియున్నను శరీరమునకే యాధర్మములున్నవిగాని నేను జన్మరహితుడను. మందాంధకారమందు త్రాడు పాముగా కనపడుచున్నది. విషయము బాగుగా తెలిసిన తరువాత త్రాటియందు సర్పధర్మములు లేవు. అంతయు చిత్త భ్రాంతియే. జగత్ ప్రతీతియు మనఃకల్పితమే దీప ప్రకాశముచే త్రాడు త్రాడుగా తెలిసినప్పుడు ఆత్మ జ్ఞానోదయముచే స్వస్వరూపమును తెలిసికొని జగద్భ్రాంతి లేదనియే నిశ్చయము కలుగుచున్నది. పరతత్త్వజ్ఞానమందు జగద్భ్రాంతిలేదు.

సత్యభూత బ్రహ్మపదార్ధము సదాయుంటున్నది. దానికై వేరుగా ప్రయత్నింప నవసరములేదు. యధార్ధ వస్తువు జన్యముకాదు. జనకముకాదు. అని శ్రుతి సాక్షాత్తుగా చెప్పుచున్నది. శ్రుతియనగా అడ్డులేనిది. యధార్ధమునే తెలుపును.

శ్రీ గురుభ్యోనమః

౧౭ం - వైరాగ్యము-బోధ

సకల సాధనలలోను వైరాగ్యమే అత్యంత ప్రధానమని సకల శాస్త్రములు చక్కగా చెప్పుచున్నవి. పక్షి తన రెండు ఱెక్కలచే అత్యున్నతమైన వియత్తలమున స్వేచ్ఛగా విహరించుచున్నది. ఆ ఖగవిహారమునకు కొండలు గాని చెట్టులుగాని అడ్డురావు అన్నింటికన్న విలక్షణమైన, మహత్తైన చిదాకాశ మనబడు పరబ్రహ్మమునందు పురుషుడు పక్షివలె వైరాగ్యము-బోధ అనెడి ఱెక్కలచే స్వేచ్ఛగా విహరించుచున్నాడు. అవిద్యయను పెద్ద పర్వత శిఖరములు ప్రతి బంధకములు కాజాలవు.

వైరాగ్యముగల వివేకిని కామక్రోధాది దుర్వృత్తులు పాప పుణ్య సుఖదుఃఖ శీతోష్ణాది ద్వంద్వములు బాధింపజాలవు. బ్రహ్మ మొదలు, దేహేంద్రియాదులయందు ఎ యే అనాత్మ పదార్థములు గలవో వానియన్నింటియందు ఇచ్ఛ లేకుండుటయను వైరాగ్యము, స్వస్వరూపమును తెలిసికొనుటయను బోధ, ఇవి రెండు కలవాడు. ద్వంద్వములను నశింపజేసిన వాడై అజ్ఞానము నతిక్రమించి పరబ్రహ్మయందు అత్యంతానందముతో విహరించుచున్నాడు. ఇట్టి స్థితి వైరాగ్యము బోధలేనిదే కలుగదు.

కేవలము బోధయుండిన లేదా కేవలము వైరాగ్యముండిన పురుషుడు బ్రహ్మోన్నత స్థితిని పొందజాలడు. విహంగమునకు కేవలము ఒక ఱెక్కయుండిన ఎగురజాలదు. జీవపక్షి వైరాగ్యము-బోధ అను రెండు ఱెక్కలచే బ్రహ్మైక్యము అను సౌధము నెక్కుచున్నాడు. జనన-మరణ రహిత పదవితో అఖండానందముతోనున్నాడు. కనుక ముక్తి లభించునని తెలిసి వైరాగ్యము బోధలను బాగుగా నభ్యసించి పరబ్రహ్మమునందు విహరించవలెను అని గురువు శిష్యునకు ఉపదేశించు చున్నాడు. వైరాగ్యము-బోధలలో ఏది లోపించినను అంగ విహీనుడగుచున్నాడు. బాహ్యేంద్రియములు అంతరేంద్రియములు కలసియే ఒక పనిచేయుచున్నవి. అలాగునే జ్ఞాన వైరాగ్యములు కలసి ముక్తి కార్యమును సిద్ధింపజేయుచున్నవి.

బాహ్య ప్రపంచమునందును, దేహేంద్రియాదులయందును అభిమాన రహితుడై, బంధు మిత్రాదులయందు ఆశలేనివాడై, సకల విషయములను విషముకంటే ప్రాణహరణములుగా తలంచినవాడై బాహ్య సంబంధమును వదులుచున్నాడు. పాప సంకల్పములను, కామ క్రోధాది వృత్తులను అనాత్మ భావములను దూరీకరించినవాడై ఆంతరిక సంకల్పములను త్యజించు చున్నాడు. వైరాగ్యశీలునకే బాహ్య ఆంతరిక సంగత్యాగము సాధ్యమగు చున్నది.

బాహ్య వస్తుపరిత్యాగము, ఆంతరిక సకలవృత్తినాశము, బ్రహ్మనిష్ఠా పరుడైన విరక్త చిత్తునకే సాధ్యము. ఇహలోక పరలోకములకు సంబంధించిన సకల విషయములయందును ఆశలేకుండుట వైరాగ్య మగును. ఇట్టి ముముక్షువు పరబ్రహ్మమందాసక్తుడై పరమాత్మ ధ్యానమందు స్థిరనిష్టగలవాడై బయటి దృశ్యప్రపంచముతోను ఇంద్రియములతోను తగులిమివదలి, ఆంతరిక అహంకార మమకారములను దూరీకరించి శాశ్వత సుఖమును పొందుచున్నాడు. పరబ్రహ్మమును పొంది తాను పరబ్రహ్మమే యగుచున్నాడు. అసంగమైన ఆత్మ స్థితిని పొందినవాడు పరిపూర్ణయోగి.

హంస రెండు రెక్కలుతోక ఈ మూడింటితో ఆకాశమున మిగుల ఎత్తులో విహరించుచ్నుది. వైరాగ్యము బోధ అను రెండు రెక్కలు, ఇంద్రియ నిగ్రహముచే కలుగు ఉపరతి అనుపుచ్ఛము(తోక) ఉన్నసాధకుడు ఖగమువలె చిదాకాశమున పరబ్రహ్మతలమున విహరించుచున్నాడు. పక్షి మొదట ఎగురునప్పుడు రెక్కలను తోకను చలింపజేయుచున్నది. ఎత్తు ప్రదేశమున చలింపనీయక భయము లేనిదై రెక్కలను చాచి కదలనీయక విహరించు చున్నది. అలాగున అభ్యాస కాలమున వైరాగ్య-బోధ-ఉపరతులు వృద్ధిపొంది వాటితో బ్రహ్మస్థానమున విహరించుచున్నాడు. ఇవి స్థిరమగునప్పుడు ఆనందముతో విహరించుచున్నాడు.

ఆశలేకుండుటయను పర వైరాగ్యముండవలయును. నిష్కల్మషవైరాగ్యో పేతునకు మనస్సు బ్రహ్మమందు స్థిరముగా నిలచుట, వృత్తులన్నియు

నాశనమై సమాధికలుగును. అప్పుడు నేనే పరబ్రహ్మమను స్వయంప్రబోధ కలుగును. 'ఏకమేవాద్వితీయమ్' అను ప్రబోధచే హృదయ పుండరీకము వికసించినదియగును. ఇట్టియధార్ధ అనుభవముగల వానికి అజ్ఞానావరణము తొలగి, బంధ విచ్ఛేదనము కలిగి పరబ్రహ్మాకారస్థితి జనించును. ఇదియే కైవల్య పదవి. అఖండ విజ్ఞాన బ్రహ్మానందము. ముఖ్య తాత్పర్యము పర వైరాగ్యముచే సమాధి లాభము, నిత్యానందానుభవము కలుగుచున్నది. కాబట్టి వైరాగ్య-సమాధి -బోధ-ఉపరతులు పరమ సాధనములని తెలియవలయును. వైరాగ్య భాగ్యమబ్బిన అన్నియు శుభములే. ఈ వైరాగ్యము బహు జన్మకృత సద్గురు శుశ్రూష చేతనే కలుగుచున్నది.

సర్వ అనాత్మ పదార్ధములు దేహాదులు ద్వైత బుద్ధినే కలుగ జేయును. జనన-మరణాది భయమును పుట్టించును కనుక దేనియందు ఆశలేకుండుటే సమస్తమును తృణమువలె తలచుట, సమస్తమును త్యజించుట యను వైరాగ్య మొకటియే అభయమును కలుగజేయును. ఆశయే సంసారము-కావున దృఢతర వైరాగ్యమునవలంభించి వాంఛా రహితుడై యుండవలెను. నిరాశకు సమమైన సుఖములేదు. అనేక జన్మ కృత పుణ్యరాశిచే వైరాగ్యము కలుగును. దానిచేతనే జ్ఞానము కలుగును. శాస్త్ర విచారణచేత సజ్జన సహవాసముచేత వైరాగ్యోదయము కలుగును.

సుషుమ్నానంతఃపురమున బ్రహ్మరంధ్రమను సౌధములో ముక్తికాంత విహరించుచున్నది. దానికి మార్గము బోధయుక్త వైరాగ్యమే. కావున వైరాగ్యము కంటే పరమసాధన మింకొకటి లేదు. కాలకూట విషముకంటె మహా తీవ్రమైన ఇంద్రియాది విషయములయందున్న భోగేచ్ఛను వైరాగ్యమను ఖడ్గముచే ఛేదింపవలయును. విషము ప్రాణహరణము. ఇంద్రియాది విషయానుభవము కూడ విజ్ఞాన ధ్వంసక మైయున్నది. వివేకముచే స్థూల శరీరధర్మములైన కుల-జాతి-మత- ఆశ్రమ అభిమానమును వీడవలయును. బోధసహిత వైరాగ్యముచే ఆత్మరాజ్యము చేకూరును. కావున కోరికలను విడిచి పరమాత్మ యందు ప్రజ్ఞనుంచవలయును. అదియే బ్రహ్మానందము.

శ్రీ గురుభ్యోనమః

జీవన్ముక్తదశ

<u>పండితుడు</u> - నిరంతరము తనలో ఆపరిపూర్ణ పరబ్రహ్మమును ధ్యానించి సాక్షాత్కరించుకొన్నవారే పండితులు. పరబ్రహ్మను దర్శించుటకు కృతకృత్యుడై, నిష్ణాతుడై, సమర్ధుడై యుండుటయే పాండిత్యము <u>విద్వాంసుడు</u> - ఆత్మ అనాత్మ వివేకముచే ఆత్మను చక్కగా నెరిగిన వివేకజ్ఞాన సంపన్నుడు. సకల దృశ్యములను దూరీకరించి చిత్తమును ఆత్మలో లయింపజేసి నిరంతరము ఆత్మాను సంధానురూప సమాధియందుండువాడు విద్వాంసుడు. <u>జీవన్ముక్తుడు</u> - సర్వమును చిత్స్వరూపముగా గాంచువాడును తనను ఇతరులను బేధ రహితముగ చూచువాడును జీవన్ముక్తుడు- బ్రహ్మజ్ఞాని-స్థిత ప్రజ్ఞ సర్వదాయుండువాడు.

దృఢ ప్రజ్ఞకల మహానుభావుడు నేను సచ్చిదానంత స్వరూపుడను. పరబ్రహ్మను, అసంగుడను, ప్రకృతి దూరుడను, కేవలముక్తుడను అను విజ్ఞానముతో బ్రహ్మామృతమును పానము చేయుచు నిత్యానందము నొందు చున్నాడు మరియు సర్వదృశ్యమును మరచి సంకల్పములు లేనివాడై షడ్భావ, షడూర్మి వర్జితుడై పరబ్రహ్మ స్వరూపుడగుచున్నాడు. ఇట్టి ప్రజ్ఞయే అపరోక్ష జ్ఞానము.

జాగ్రదావస్థయందు సకల వ్యవహారములను వదలుకొని త్రివిధావస్థ లను, త్రివిధ గుణములను, త్రివిధములయిన మనోవాక్కాయములను అతిక్రమించి, తురీయ స్థితిలో నున్నవాడు. సకల సంస్కారములు వృత్తులు, గుణములు, సంకల్పములు నశించి అఖండ స్వయం ప్రబోధ విజ్ఞానము కలవాడు అయిన మహనీయుడు సిద్ధుడయిన జీవన్ముక్తుడని తెలియ వలయును. సకల వేదవేదాంగముల పారంగతుడైనను ఆ విద్యలన్నియు బుద్ధికి ప్రకృతికి సంబంధించినవని వాటిని విసర్జించి విద్యారహితుని వలె పిచ్చివానివలె తిరుగుచుండును. వాని స్థితిని సకల వేదాంత శాస్త్రములు ప్రశంసించుచున్నవి. అట్టి యోగి వర్యుడు జీవన్ముక్తుడు వారి అఖండ ప్రజ్ఞను లోకక్షేమమునకు వెలిబుచ్చుదురు.

జీవన్ముక్త స్థితిని పొందిన విద్వాంసుడు దేహేంద్రియములకు విలక్షణు డగుటచే శరీరగత ధర్మములచే కొట్టబడడు. అట్టి వానికి పరాభవము ఎదురయినను పరాభవము కలిగినదని తలచడు. అవమానమునకు ఏ మాత్రము చలించడు. దత్తాత్రేయులు మొ॥ బ్రహ్మ వేత్తలట్టివారే. శరీరము దుఃఖాలయమగుటచేత శరీరముతానని గాని తనదనిగాని భావించక ఆ పరబ్రహ్మమే తానని తలంతురు. మనుష్యుడు తాను పొందవలసినది తప్పక పొందుచున్నాడు. దైవము కూడా దానిని అడ్డుకొనదు. "నాకు రావలసినది వచ్చును, సంతోషపడను నాకు రానిది రానేనాదు.దాని గురించి దుఃఖపడను. నాకు సంబంధించినది ఇతరులకుపోదు.ఈలాగున వివేకి విచారణ చేయును. కనుక లాభనష్టములకు భీతిల్లడు. జీవన్ముక్తులు లోకోద్ధరణ కొరకు ప్రాప్తమయిన కార్యములను విధి పూర్వకముగా ఆచరింతురు. మరియు అసంగులై నిర్లిప్తులై యుందురు.

ఈ చరాచరాత్మక విశ్వమందు యోగి సమత్వముతో చరించుచున్నాడు. సమత్వమనునది మహానుభావులకే సహజమైయున్నది. మహాత్ముల యొక్క విశాల భావము ఏ ప్రాణియు దుఃఖమునొందక సుఖము పొందవలయునని వాంఛింతురు.

నామరూపములు జగల్లక్షణము నామరూప రాహిత్యము పరబ్రహ్మ లక్షణము ప్రపంచము నానాత్వము, మిధ్యాత్వము, పరమాత్మ ఏకత్వము, నిత్యత్వము, ప్రపంచము అనృతజడ దుఃఖము. పరమాత్మ సచ్చిదానందము. ఈ లాగున విచారించిన దృశ్యమంతయు దృక్కుకు ఆత్మకంటే సర్వదా విలక్షణమైయున్నది. మిధ్యాభూత జగత్తును విడనాడి బ్రహ్మదృష్టితో ఆపరిపూర్ణ పరబ్రహ్మమే తానని జీవన్ముక్తుడు నిస్సంశయముగా తెలియుచున్నాడు. అటుల బ్రహ్మదృష్టితో గాంచుటయే సమదర్శిత్వమనబడుచున్నది. ఈ సమత్వ దృష్టియే జీవన్ముక్తుని లక్షణము. సమత్వదృష్టి గల జీవన్ముక్తులు పరిపూర్ణ పర బ్రహ్మ స్వరూపులై నిస్సంగ నిర్లిప్త నిర్గుణ నిర్దుష్ట పరమపదవిలో నుంటున్నారు. వీరె స్థితిప్రజ్ఞులు.

జీవన్ముక్తుడు ద్వంద్వములు లేనివాడై యుండును. బ్రహ్మజ్ఞాని భేద,

అభేదములు లేనివాడగుటచే రాగద్వేష రహితుండగుచున్నాడు. ఇంద్రియములలో రాగద్వేషములుంటున్నవి. కనుక వానికి వశముగా కూడదు. అవిజ్ఞానమునకు శత్రువులు, సమత్వదృష్టి జీవన్ముక్తుని లక్షణము. జీవన్ముక్తుడు ప్రకృతికి సంబంధించిన వానియందు ఉదాసీనత వహించినవాడై కర్తృత్వబుద్ధిని విడనాడి సర్వసంగ పరిత్యాగియై యుండును. స్వస్వరూప జ్ఞానము తెలియక పోవుటయే సంసారబంధము.

బ్రహ్మజిజ్ఞాస తీవ్రమగుటచే గురువు ద్వారా చతుర్విధ మహావాక్యములు శ్రవణము చేసి, మననము చేసి, తదైక్యతను నిర్ణయించుకొనుచున్నాడు. వేదాంత వాక్య శ్రవణము చేసి మననము చేసి తదైక్యతను నిశ్చయించు కొనుచున్నాడు. వేదాంత వాక్య శ్రవణ - మనన - నిధి ద్యానము చేతను తనయొక్క బ్రహ్మత్వమును తెలియుచున్నాడు. అందుచే సకల బంధముల నుండి విముక్తుడై బ్రహ్మస్వరూపుడగుచున్నాడు. గృహ ఆరామ క్షేత్రాదుల యందు దృశ్య ప్రపంచమునందు అహంకార మమకార బుద్ధి ఎవనికి కలుగదో అట్టి విద్వాంసవరిష్ఠుడు జీవన్ముక్తుడు. బ్రహ్మముకన్న వేరు వస్తువులేదు. ఇట్టి అఖండ విజ్ఞానము కలవారే జీవన్ముక్త విద్వాంసులు.

మూఢ జనులు తనను పూజించినను, దూషించినను, బాధించినను ఆ పూజలను దూషణాదులను సమముగ తలంచు మహానుభావులు జీవన్ముక్తులు. ఈ విధముగ అఖండ ప్రపంచాతీత చిన్మయ చిద్ఘన ఆనందఘన స్థితి సంపన్నుడే జీవన్ముక్తుడు. జీవన్ముక్తుడు శరీర సంబంధము కలిగి యున్నాడు. విదేహముక్తుడు సకలసంకల్పములు నశించినందుచే సదాముక్తుడే జన్మరహితుడే లోక వ్యవహారమునకు ఉపయోగపడడు. బ్రహ్మవేత్తలగు జీవన్ముక్తులకు భిక్షాన్నమే ఆహారము, స్మశానమందు నిద్ర, పుడమియే పాన్పు, పరబ్రహ్మయందు క్రీడించుటయే సహజసిద్ధ లక్షణములు. పరబ్రహ్మను పొందిన వాడగుటచే కర్తవ్యము కూడా లేదనియర్థము.

సకల బంధ నిర్ముక్త జీవబ్రహ్మైక్య విజ్ఞానమే జీవన్ముక్త మహా విద్వాంసుని లక్షణమని నిరూపించబడెను. బ్రహ్మానందమే ముక్త లక్షణము.

: మంగళహారతి :

1) నిర్వికారాయ సకల నిత్యముక్తిదాయకాయ
నిర్గుణాయ నిర్మలాయ నిత్యమంగళం ॥నిర్వి॥

2) సగుణ నిర్గుణ రహితాయ-సంకల్ప వర్జితాయ
సర్వ సాక్ష్యాతీతునకు సత్యమంగళం ॥నిర్వి॥

3) సత్తు చిత్తు సమసిపాయ శతృ సంహారణాయ
వత్తి లేని దీపము నీకిత్తు మంగళం ॥నిర్వి॥

4) చేష్టలన్ని ఉడిగిపాయ చేసేదేమి లేకపాయ
శేషమ్మ మనసు మీలో చేరె మంగళం ॥నిర్వి॥

5) పరిపూర్ణాయ సకల భవ్య దివ్య రూపాయ
పరశురామాయ సీతారామ మంగళం ॥నిర్వి॥

6) మంగళం గురుదేవాయ మహనీయ గుణాత్మనే
సర్వలోక శరణ్యాయ సాధు రూపాయ మంగళం ॥నిర్వి॥